నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
ఆదివారం
05-10-2025
పేజీలు: 02



## తుస్సుమన్న ఫ్రీ బస్సు పథకంతో దివాళా తీసిన ఆర్టీసీ: కేటీఆర్

సిటీ బస్సు చార్జీల పెంపుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) విమర్శించారు. జంటనగరాల్లో బస్ చార్జీల పెంపు నిర్ణయం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకేసారి ఏకంగా రూ.10 పెంచి పేద, మధ్య తరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని సీఎం నిర్ణయించారని ధ్వజమెత్తారు. చార్జీల పెంపుతో ప్రయాణికుడిపై నెలకు రూ.500 అదనపు భారం పడుతుందని చెంపారు. బడుగు జీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస చార్జీపై 50 శాతం ధర పెంచడం అసమర్ధ విధానాలకు నిదర్శనమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ప్రజలపై కక్ష పెంచుకున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.'సిటీ బస్సు చార్జీలను ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఒకేసారి 10 రూపాయలు పెంచి జంట నగరంలోని పేద మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్న రేవంత్ రెడ్డి నిర్ణయాలు దుర్మార్గమైనవి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న తరుణంలో.. ప్రతి ప్రయాణికుడిపై నెలకు 500 రూపాయల అదనపు భారం మోపితే బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలి. ఇప్పటికే విద్యార్థుల బస్ చార్జీలు, టీ-24 టిక్కెట్ చార్జీలను పెంచింది చాలదన్నట్టు.. ఇప్పుడు కనీస చార్జీపై కనికరం లేకుండా 50 శాతం టిక్కెట్టు ధరలను పెంచడం రేవంత్ అసమర్ధ విధానాలకు నిదర్శనం. రాజధానివాసుల నడ్డివిరిచి ప్రతినిత్యం దాదాపు కోటి రూపాయల భారం మోపాలని చూస్తున్న ముఖ్యమంత్రి హైదరాబాద్ ప్రజలపై కక్ష పెంచుకుంటున్నట్టు అర్ధమవుతోంది. తుస్సుమన్న ఫ్రీ బస్సు పథకంతో దివాళా తీసిన ఆర్టీసిని గట్టెక్కించాల్సిందిపోయి, సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూడటం క్షమించరానిది.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# ప్రయాణికులకు షాక్..
# ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీల పెంపు

ప్రయాణికులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. మరీ ముఖ్యంగా దసరా పండుగ ముగిసిన కొద్దీ రోజుల్లోనే హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఒక్కసారిగా పెద్ద షాక్ ఇచ్చింది. జంట నగరాల పరిధిలో నడుస్తున్న ఆర్టీసీ బస్సుల ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. సోమవారం (అక్టోబర్ 6) నుంచి ఈ టికెట్ ధరల పెంపు అమల్లోకి వస్తుందని పేర్కొంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీల వరకు రూ.5 పెంపు ఉంటుంది. 4వ స్టేజీ నుండి రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేయనున్నారు. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో కూడా ఇదే విధంగా పెంపు ఉంటుందని ఆర్టీసీ తెలిపింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజీలకు రూ.5, నాల్గవ స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నారు. అదే విధంగా, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో AC సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు విధిస్తారు. ఈ ఛార్జీలు అక్టోబర్ 6 (సోమవారం) నుండి అమల్లోకి వస్తాయి. TGRTC ఈ నిర్ణయం పర్యావరణహిత



రవాణా విధానాన్ని ప్రోత్సహించేందుకు, ఎలక్ట్రిక్ బస్సుల వాడకాన్ని పెంచేందుకు తీసుకున్నట్లు తెలిపింది. నగర రవాణా వ్యవస్థను ఆధునికీకరించడం కోసం ప్రజల సహకారం అవసరమని సంస్థ అభిప్రాయపడుతోంది. భవిష్యత్తులో TGRTC 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సేవలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో పాటు 19 డిపోలలో హెచ్‌టీ ఛార్జింగ్ కనెక్షన్లు, 10 కొత్త డిపోలు, 10 ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.392 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. TGRTC ప్రకారం, ఈ అదనపు ఛార్జీలు తాత్కాలిక ఆర్థిక భారమే అయినప్పటికీ, దీని వెనుక ఉన్న లక్ష్యం నగర రవాణాను మెరుగుపరచడం, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం అని స్పష్టం చేసింది. గతంలో మాదిరిగానే ప్రజలు TGRTC సేవలకు మద్దతుగా నిలవాలని సంస్థ కోరుతోంది.రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచితంగా ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించింది. దీంతో సర్కార్ కు తలకు మించిన భారంగా మారింది. ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు బాకీ పడింది. ఓ వైపు సర్కార్ డబ్బులు ఇవ్వకపోవడం, మరోవైపు సంస్థ నిర్వహణ కష్టంగా మారడంతో ఆర్టీసీ సంస్థ బస్ ఛార్జీలు పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సిటీ వరకు పెంచి, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ ఛార్జీలు పెంచాలని భావిస్తున్నట్లు సమాచారం. బస్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆడవాళ్లకు ఫ్రీ పెట్టి ఆ డబ్బులను మగవాళ్ల నుంచి వసూళ్లు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. సర్కార్ కు చేతకాకపోతే ఎందుకు ఫ్రీ బస్సు పథకం ప్రవేశపెట్టారని నిలదీస్తున్నారు. మగవాళ్ల జేబులు గుల్లా చేసేందుకే ఇలా ఛార్జీలు పెంచుకుంటూ పోతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఆర్టీసీ బస్సు ఛార్జీలు, మరోవైపు మెట్రో రైలు ఛార్జీలు పెంచితే ఎలా ప్రయాణం చేసేది అంటూ ప్రశ్నిస్తున్నారు.

## ఆధార్ కార్డుపై కేంద్రం సంచలన నిర్ణయం



ప్రస్తుతం, ఆధార్ కార్డు ప్రతి ఒక్కరికీ కీలకమైన పత్రంగా మారింది. బ్యాంకు ఖాతా తెరవడం నుండి ప్రభుత్వ పథకాలను పొందడం వరకు, ప్రతిచోటా ఆధార్ అవసరం. ఇది UIDAI జారీ చేసిన 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు. అంతేకాకు ఇది చిరునామాకు రుజువుగా ఉపయోగించడం జరుగుతుంది. తాజాగా బయోమెట్రిక్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది.ఆధార్‌లో పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (MBU) రుసుమును పూర్తిగా మాఫీ చేసినట్లు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) ప్రకటించింది. ఈ కొత్త నియమం అక్టోబర్ 1, 2025 నుండి అమల్లోకి వచ్చింది. రాబోయే ఒక సంవత్సరం పాటు అమలులో ఉంటుంది. దీంతో దాదాపు 60 మిలియన్ల మంది పిల్లలకు ప్రయోజనం చేకూరుస్తుందని UIDAI చెబుతోంది. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్ కార్డు పొందడానికి, వారి ఫోటో, పేరు, పుట్టిన తేదీ, లింగం, చిరునామా, జనన ధృవీకరణ పత్రం అవసరం. ఈ వయస్సులో వేలిముద్రలు, ఐరిస్ బయోమెట్రిక్స్ తీసుకోవడం కుదరదు. ఎందుకంటే అవి ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందవు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, పిల్లల వేలిముద్రలు, ఐరిస్, ఫోటోను 5 సంవత్సరాల వయస్సు తర్వాత ఆధార్‌లో అప్‌డేట్ చేస్తారు. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు వారి ఫోటో, పేరు, పుట్టిన తేదీ, లింగం, చిరునామా, జనన ధృవీకరణ పత్రాన్ని అందించడం ద్వారా ఆధార్ కోసం నమోదు చేసుకోవచ్చు.



## రాశి లెటెస్ట్ లుక్స్

హీరోయిన్ గా సక్సెస్ కావడం అంత ఈజీ కాదు. ఎంతో మంది కుర్ర హీరోయిన్స్ ఇప్పటికీ స్టార్ డమ్ కోసం ఎదురుచూస్తున్నారు. అవకాశాలు వస్తున్న అదృష్టం కలిసి రాని భామల్లో రాశి ఖన్నా ఒకరు. ముందుగా ఈ చిన్నది బాలీవుడ్ లో సినిమాలు చేసింది.ఆతర్వాత ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ వయ్యారి భామ. మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే అందం, నటన పరంగాను రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి.ఇక రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది.యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది. కానీ ఈ అమ్మడు అంతగా అవకాశాలు రావడం లేదు.దాంతో ఇటీవలే బాలీవుడ్ లో ఓ వెబ్ సిరీస్ చేసింది. దాంతో ఇప్పుడు బాలీవుడ్ పైనే ఈ చిన్నది ఫఫోకస్ పెడుతుంది.




## 80s రీయూనియన్.. ఒకేచోట కలిసిన స్టార్ నటులు

దక్షిణాది సినిమా పరిశ్రమలో 1980వ దశకంలో ఇండస్ట్రీలోకి వచ్చి స్టార్‌డమ్‌ని అనుభవించిన నటీనటులందరూ ప్రతి సంవత్సరం '80s Stars Reunion' పేరిటా కలుసుకుంటారన్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది కూడా ఈ స్టార్ నటులందరూ ఒకేచోట కలిశారు. టాలీవుడ్ నుంచి మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నరేష్ తదితరులు హాజరుకాగా.. ఇతర ఇండస్ట్రీల నుంచి పలువురు స్టార్ నటులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఇక అందరూ కలిసి ఒకే డ్రెస్ కోడ్‌లో హాజరయినట్లు ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. అయితే ఈ వేడుకపై చిరంజీవి ఎక్స్ వేదికగా ప్రత్యేక పోస్ట్ పెట్టాడు.80 దశకంలో నాతో కెరీర్ ప్రారంభించిన నా ప్రియమైన స్నేహితులతో ప్రతి రీయూనియన్ జ్ఞాపకాల వీధిలో ఒక నడకలా ఉంటుంది. నవ్వు, వెచ్చదనం మరియు దశాబ్దాలుగా మనం పంచుకున్న అదే విడదీయరాని బంధంతో నిండి ఉంటుంది. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు, ఇంకా ఎన్నో అంటూ చిరు రాసుకోచ్చాడు.





## కోల్డ్రిఫ్ సిరప్.. 11 మంది చిన్నారుల మృతికి కారణమైన డాక్టర్ అరెస్ట్



మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 11 మంది చిన్నారుల మృతికి కారణమైన దగ్గు మందు రాసిన డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగిన పక్షం రోజుల్లోనే చిన్నారులు కిడ్నీ ఫెయిల్ అయి మృతిచెందారు. ఈ నేపథ్యంలో కాఫ్ సిరప్ సూచించిన డాక్టర్ ప్రవీణ్ సోనీని పరాసియా ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు భోపాల్ పోలీసులు ఆదివారం ఉదయం ప్రకటించారు. ప్రభుత్వ డాక్టర్ అయిన ప్రవీణ్.. చింద్వారాలో ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం తన వద్దకు వచ్చిన చిన్నారులకు ఆయన కోడ్రిఫ్ సిరఫ్‌ను సూచించారు. దీంతో 11 మంది చిన్నారులు అస్వస్థతకు గురై మరణించారు. ఈ నేపథ్యంలో కోల్డ్రిఫ్ సిరప్ అమ్మకాలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. డాక్టర్‌పై కేసు నమోదుచేసిన పోలీసులు అదుపులోకి తీసుకుంది. ఆ సిరప్‌ను ఉత్పత్తి చేస్తున్న శ్రీసన్ ఫార్మాస్యూటికల్స్‌పై ప్రభుత్వం కేసు నమోదుచేసింది. ఈ కంపెనీ తమిళనాడులోని కాంచీపురంలో ఉన్నది. సిరప్‌లో నాన్-ఫార్మాకోపోయియా-గ్రేడ్ ప్రొపైలిన్ గ్లైకాల్‌ను ఉపయోగించారని దర్యాప్తులో తేలింది. ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలైన డైథిలిన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్‌తో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు. ఈ నివేదిక తర్వాత తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్రిఫ్ సిరప్ అమ్మకం, వాడకాన్ని నిషేధించింది. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో స్టాక్‌ను ఫ్రీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కంపెనీకి ఉత్పత్తిని నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. తయారీ లైసెన్స్‌ను రద్దుకు షోకాజ్ నోటీస్ పంపారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## ఓటేసిన ప్రజలను నట్టేట ముంచుతున్న రేవంత్ రెడ్డి: హరీశ్ రావు

తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ తెలంగాణే తన ప్రాణంగా భావించారని, ఎవరికి కష్టం వచ్చినా ఊరుకోలేదని చెప్పారు. రేవంత్ రెడ్డి మాత్రం ఓటేసిన ప్రజలను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. తెలంగాణ రైతులు అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్నచూపని విమర్శించారు. ఎమ్మెల్యే మాణిక్ రావు ఆధ్వర్యంలో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా జడ్పీ స్థానం బీఆర్ఎస్ కైవసం చేసుకోబోతుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతుంది. జహీరాబాద్ నియోజకవర్గంలో పెద్దఎత్తున ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకుంటాం. తెలంగాణ ప్రజలను మోసగించడంలో, దోచుకోవడంలో కాంగ్రెస్-బీజేపీ రెండు దొందూ దొందే. ఒక పార్టీది మోస చరిత్ర, మరొక పార్టీది ద్రోహ చరిత్ర. చోటా భాయ్, బడే భాయ్ ఇద్దరిదీ ఒకే తీరు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే , తెలంగాణ పాలిట శకునిలే.

## ఆ గ్రామాలకు.... 6 లైన్ల రహదారి
# ఇక 8 లైన్లుగా విస్తరణ



తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు, ముఖ్యంగా రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణాలపై నెలకొన్న అయోమయాన్ని తొలగిస్తూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టతనిచ్చారు. రహదారుల విస్తరణ, నిర్మాణ పనులపై వదంతులు నమ్మొద్దని రైతులకు ఆయన సూచించారు. శనివారం చిట్యాల మండలంలో జరిగిన ఒక బహిరంగ సభలో మంత్రి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలకమైన రెండు రోడ్డు ప్రాజెక్టుల పురోగతి గురించి ప్రస్తావించారు.

**జాతీయ రహదారి 65 విస్తరణ:**

ఈ రహదారి విస్తరణ పనులకు సంబంధించి డిసెంబర్ నెలలో టెండర్లు పిలుస్తామని.. ఆ తర్వాత వెంటనే జనవరిలో విస్తరణ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఈ జాతీయ రహదారిని 6 లైన్ల నుంచి 8 లైన్లుగా విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా రహదారి పక్కన ఆనుకొని ఉన్న గ్రామాలు, పట్టణాలకు మరింత సౌకర్యవంతంగా ప్రయాణాలు సాగించవచ్చు. భారతదేశంలోని ఈ ప్రముఖ జాతీయ రహదారి 65 నాలుగు రాష్ట్రాల గుండా విస్తరించి ఉంది. ఈ రహదారి ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రయాణిస్తుంది. ఇది మహారాష్ట్రలోని పూణే నగరం వద్ద మొదలవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం వద్ద అంతమవుతుంది.ఈ మార్గంలో ముఖ్యంగా పూణే, సోలాపూర్, హైదరాబాద్, సూర్యాపేట, విజయవాడ మరియు మచిలీపట్నం వంటి ప్రధాన నగరాలను కలుపుతుంది. ఈ రహదారిలో అత్యంత ముఖ్యమైన విభాగం హైదరాబాద్, విజయవాడ మధ్య ఉంది. ఈ భాగాన్ని సాధారణంగా విజయవాడ-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా NH-65 అని పిలుస్తారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రయాణించేటప్పుడు.. ఇది హైదరాబాద్‌నుంచి బయలుదేరి చౌటుప్పల్, చిట్యాల్, నార్కెట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, మునగాల, కోదాడ వంటి కీలక పట్టణాలను కలుపుతూ ఆంధ్రప్రదేశ్ సరిహద్దును చేరుకుంటుంది.

**రీజినల్ రింగ్ రోడ్డు:**

ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని మంత్రి కోరారు. RRR అలైన్‌మెంట్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయినట్లు, రైతులు తమ భూములను కోల్పోతున్నట్లు మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం అని ఆయన కొట్టిపారేశారు. అలైన్‌మెంట్ విషయంలో ఎలాంటి మార్పులు జరగలేదని, రైతుల భూములు కోల్పోయే పరిస్థితి లేదని మంత్రి వివరించారు.

**రైతులకు భరోసా..**

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై అనేక వదంతులు ప్రచారంలో ఉన్నాయి. ముఖ్యంగా దివిస్ కంపెనీ ప్రయోజనాల కోసం ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మారుస్తున్నట్లు వస్తున్న మీడియా కథనాలను మంత్రి పూర్తిగా ఖండించారు. RRR నిర్మాణానికి సంబంధించి ఒకసారి అలైన్‌మెంట్ ఖరారైన తర్వాత.. ఆ మార్గంలో పెద్ద పెద్ద కంపెనీలు ఉన్నా, రాజకీయ నాయకుల భూములు ఉన్నా మార్చే ప్రసక్తే లేదని ఆయన హామీ ఇచ్చారు. అలైన్‌మెంట్ ప్రక్రియ డిసెంబర్ నాటికి పూర్తయ్యాక.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి, మంత్రిమండలిలో కూలంకషంగా చర్చించిన అనంతరం రైతులకు పూర్తి న్యాయం చేస్తామని వెంకటరెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా.. ఆర్ఆర్ఆర్ వెళ్లే ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, రైతులను వ్యక్తిగతంగా కలిసి, వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని.. వారిని ఒప్పించిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ హామీలతో.. భూములు కోల్పోతామనే భయంతో ఉన్న వేలాది మంది రైతులకు తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కందిమల్ల శశిపాల్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## మండాడి సినిమా షూటింగ్‌లో
# ప్రమాదం!

తమిళ విలక్షణ నటుడు సూరి — తెలుగు నటుడు సుహాస్ కలిసి నటిస్తున్న కొత్త చిత్రం 'మండాడి'. కాగా ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చెన్నై సముద్ర తీరంలో శరవేగంగా జరుగుతోంది. కానీ, ఈ సినిమా షూటింగులో ఓ అపశృతి జరగడం దురదృష్టకరం. ఈ సినిమా షూటింగులో భాగంగా కొన్ని సన్నివేశాలను సముద్రంలో షూట్ చేస్తూ ఉండగా.. సాంకేతిక నిపుణులు ఉన్న పడవ ఒక్కసారిగా బోల్తా పడింది. రామనాథ పురం జిల్లా తొండి అనే సముద్రతీర ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులతో పాటు కోటి రూపాయల విలువ చేసే కెమెరాలు కూడా నీట మునిగిపోయాయి. అయితే, యూనిట్ సభ్యులు నీట మునిగిన వ్యక్తులను రక్షించారు. దీంతో, ప్రాణనష్టం తప్పింది. అయితే విలువైన కెమెరాల సహా ఇతర సామాగ్రి కూడా నీట మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సినిమాను జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రమాదంతో వెట్రిమారన్ కి ఊహించని నష్టం జరిగింది.



## కల్కి సీక్వెల్ కోసం
# సాయి పల్లవి?

టాలీవుడ్‌లో తెరకెక్కిన 'కల్కి 2898 ఎడి' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయ్యింది. ఇక పాన్ ఇండియా ప్రభాస్ హీరోగా నటించిన ఈ సినిమాలో బాలీవుడ్ భామ దీపికా పదుకొణె కీలక పాత్రలో నటించింది. అయితే, ఇటీవల ఈ సినిమా నుండి దీపికా పదుకొణె తప్పుకున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దీంతో ఇప్పుడు ఆమె చేసిన పాత్రను ఎవరు చేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే, నాగ్ అశ్విన్ ఈ పాత్ర కోసం తొలుత ఆలియా భట్‌ను తీసుకోవాలని అనుకున్నాడట. కానీ, ఆమె ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో ఆమె స్థానంలో వేరొక హీరోయిన్ కోసం చూస్తున్నాడట. అయితే, సాయి పల్లవి ఈ పాత్ర చేస్తే బాగుంటుందని నాగ్ అశ్విన్ భావిస్తున్నాడట. మరి నాగ్ అశ్విన్ సాయి పల్లవిని ఈ సినిమా కోసం అప్రోచ్ అవుతాడా.. సాయి పల్లవి ఈ సినిమాలో నటించేందుకు ఓకే చెబుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.

## అల్లుడితో వివాహేతర సంబంధం..
# కూతురిని చంపేందుకు తల్లి, అల్లుడు యత్నం

తిరుపతి జిల్లా కేవీబీ పురంలో దారుణమైన ఘటన చోటు చేసుకుంది. కన్న కూతురు పక్కన ఉండగానే ఆమె అల్లుడిని వివాహం చేసుకోవడానికి ప్రయత్నించింది ఓ మహిళ. ఈ పెళ్లిని అడ్డుకోబోయినందుకు కన్న కూతురిపైనే తన అల్లుడితో కలిసి హత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఐదు నెలల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 18 ఏళ్ల బాలుడు, 15 ఏళ్ల బాలిక ప్రేమ వివాహం చేసుకున్నారు. భర్త మరణించడంతో, ఆ బాలిక తల్లి (40) తన కూతురు అల్లుడితో పాటే నివాసం ఉండేది. ఈ క్రమంలో ఆ మహిళకు కొన్నాళ్లుగా తన అల్లుడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. శుక్రవారం రాత్రి బాలిక నిద్రిస్తున్న సమయంలో, తల్లి, అల్లుడు ఏకంగా పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించారు. భర్త తన తల్లి మెడలో తాళి కడుతుండగా చూసిన బాలిక వెంటనే వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఆ తల్లి, ఆమె అల్లుడు కలిసి బాలికపై తీవ్రంగా దాడి చేశారు. తల్లి రోకలిబండతో కూతురి తలపై మోదడంతో బాలిక గట్టిగా కేకలు వేసింది. ఆమె అరుపులు విని స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న బాలికను కాపాడారు. ఈ దారుణానికి ఒడిగట్టిన అత్త, అల్లుడిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేశారు. అనంతరం వారిద్దరిని పోలీసులకు అప్పగించారు. బాలిక ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## ప్రత్యేకమైన ట్యాగ్‌లైన్ కోసం
# ఈపీఎఫ్ఓ ఆన్‌లైన్ పోటీ

ఉద్యోగ భవిష్యనిధి సంస్థ తన ఆశయాలను ప్రతిబింబించే విధంగా ఒక ప్రత్యేకమైన ట్యాగ్‌లైన్ కోసం ప్రజల్లోని సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ ఆన్‌లైన్ పోటీని ప్రకటించింది. ప్రజలు స్వయంగా రూపొందించిన అర్థవంతమైన, శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌లను ఈ పోటీ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.ఈ పోటీని అక్టోబర్ 1న ప్రారంభించిన ఈపీఎఫ్ఓ, అక్టోబర్ 10 వరకు ప్రజల నుంచి ఎంట్రీలను కోరుతోంది. ఇంకా సమయం ఉన్నందున ప్రజలు పెద్ద ఎత్తున పోటీలో పాల్గొనాలని కోరింది. ప్రత్యేకమైన ట్యాగ్‌లైన్‌ను సూచించిన ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు కూడా లభించనున్నాయి.అంతేకాకుండా, విజేతలకు ఢిల్లీలో జరగనున్న ఈపీఎఫ్ఓ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశాన్ని కల్పించనుంది.ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్ లేదా ట్విటర్ అధికారిక ఖాతా ద్వారా విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పోటీలో పాల్గొనవచ్చు. ట్యాగ్‌లైన్‌ను ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ పోటీ ద్వారా ప్రజల నుంచి ఉత్తమమైన భావనలతో కూడిన ట్యాగ్‌లైన్‌ను ఎంపిక చేయాలనే లక్ష్యంతో సంస్థ ముందడుగు వేసింది.సంస్థ ఆశయాలు, విధులకు అద్దం పట్టేలా ఒక అర్థవంతమైన ట్యాగ్‌ను సూచించాలని సంస్థ ప్రజలను కోరింది. ఇంకా సమయం ఉన్నందున ప్రజలు పెద్ద ఎత్తున పోటీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది.

# హాట్ మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేకమైన పరిచయం అవసరం లేదు. తెలుగులో దాదాపు అందరు స్టార్ హీరోలతో నటించి స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. అయితే, ఈ మధ్య సినిమా అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ ఐటెం సాంగ్స్ చేస్తూ బిజీగా ఉంది ఈ బ్యూటీ. ఇదిలా ఉంటే, తాజాగా తన సినిమా జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. తనకు ఈ గుర్తింపు సినిమాల వల్ల రాలేదట. కేవలం ఐటమ్స్ సాంగ్స్ వల్లనే ఫేమస్ అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది. అయితే, తమన్నా చేసిన ఈ కామెంట్స్ కి ఆమె ఫ్యాన్స్ అవాక్కవుతున్నారు. అదేంటి తమన్నా అంతమాట అన్నావ్. మేమంతా నిన్ను మా హీరోయిన్ గా ఆరాధిస్తుంటే.. నువ్వేమో ఐటెం సాంగ్స్ వల్ల క్రేజ్ వచ్చింది అంటావ్ ఏంటి అంటూ కామెంట్స్ చేస్తున్నారు.





## జపాన్‌ను వణికించిన
# భారీ భూకంపం

జపాన్‌లో భారీ భూకంపం వచ్చింది. శనివారం సాయంత్రం (స్థానిక కాలమానం ప్రకారం) హోన్షు తూర్పు తీరానికి సమీపంలో భూమి కంపించింది. దీని తీవ్రత 6.0గా నమోదయింది. 50 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించినట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ (GFZ) తెలిపింది. భూకంప కేంద్రం 10 కిలోమీటర్లు లోతులో ఉందని వెల్లడించింది. భూకంపం ధాటికి భూకంపం ధాటికి పలు చోట్ల భవనాలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల పాక్షికంగా కూలిపోయాయి. తీర ప్రాంతం కావడం వల్ల సముద్రం అల్లకల్లోలానికి గురైంది. తొలుత-సునామీ సంభవించవచ్చంటూ వార్తలొచ్చాయి గానీ అలాంటి హెచ్చరికలేవీ కూడా జారీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.